అమెరికా తెలుగుసంఘం - అమృత్‌కిరణ్ కథలపోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ

# గుండె చప్పుళ్ళు

బి. సతీష్‌కుమార్

సమయం.. ఉదయం పదకొండు గంటల ముప్పై నిమిషాలు. స్థలం... అపోలో హాస్పిటల్.

ఆపరేషన్ థియేటర్‌లో డా॥ సంతోష్ ఆపరేషన్ మొదలు పెట్టి అరగంట అవుతోంది. అతనితో పాటు థియేటర్‌లో ఇద్దరు డాక్టర్లు, ఇద్దరు నర్స్‌లు ఉన్నారు.

అతను అడిగిన వాటిని చకచకా అందిస్తూ అతనికి సహాయ పడుతున్నారు.

ఆపరేషన్ థియేటర్ బయట ఒక వ్యక్తి అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు.



అక్కడి వాతావరణమంతా చాలా టెన్షన్‌గా ఉంది.

అరగంట తరువాత థియేటర్ లోనుంచి బయటికి వచ్చిన సంతోష్ "కంగ్రాట్స్ మిస్టర్ గంగాధర్ ఆపరేషన్ సక్సెస్" అన్నాడు అక్కడున్న వ్యక్తితో.

అతను చెప్పిన మాటలు వినగానే గంగాధర్ ఆనందంతో "థాంక్యూ డాక్టర్... థాంక్యూ వెరీమచ్" అంటూ అతని చేతిలో చేయి వేసి గట్టిగా షేక్‌హాండ్ ఇచ్చాడు.

సంతోష్ నవ్వుతూ "ఇట్సాల్ రైట్" అని డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్ళాడు.

డా॥ సంతోష్ అపోలో హాస్పిటల్‌లో సర్జన్. వయసు ముప్పై నుండి ముప్పై రెండు మధ్యలో ఉంటుంది. మనిషి ఎత్తుగా దృఢంగా అందంగా ఎప్పుడూ నవ్వుతూ విజయాన్ని ఆహ్వానిస్తున్నట్లుగా ఉంటాడు.

ఇంత చిన్న వయసులో తాను ఈ స్థాయికి రావడానికి కారణం తన కృషి, దీక్ష, పట్టుదల వీటన్నిటని మించి తన పంక్చువాలిటీయేనని గట్టిగా నమ్ముతాడు.

సంతోష్‌కు సరిగ్గా నాలుగు సంవత్సరాల క్రితం సౌమ్యతో పెళ్ళైంది. ఈరోజు తన నాలుగవమారేజ్ డే. ఈరోజు మధ్యాహ్నం సరిగ్గా ఒకటిన్నరకు ఇంటి వద్ద ఉంటానని మాట ఇచ్చాడు భార్యకు.

తన గెస్ ప్రకారం ఉదయం పదిన్నరకు హాస్పిటల్‌లో నుండి బయలుదేరి గంటలో ఇంటికి చేరుకుని భార్యను సర్‌ప్రైజ్ చేద్దామనుకున్నాడు. కాని ఎమర్జెన్సీ కేసు రావటం వల్ల సుమారు గంటన్నర లేటయింది.

★★★

డ్రెస్సింగ్ రూమ్‌లో డ్రెస్ ఛేంజ్ చేసుకొని గబగబా బయటికొచ్చాడు. అతను బయటికి వస్తూండగా అతనికళ్ళు గోడకు ఉన్న వాల్‌క్లాక్ పై పడ్డాయి.

అప్పుడు సమయం సరిగ్గా పన్నెండు అవుతోంది. తను ఇంటికి వెళ్ళడానికి ఇంకా గంటన్నర టైముంది.

బయటకు వచ్చి బైక్ తీసుకొని నేరుగా పెట్రోల్ బంక్‌కు వెళ్ళి పెట్రోల్ పోయించుకొని, అక్కడినుండి నేరుగా జ్యూవెలరీ షాపుకు వెళ్ళాడు.

సౌమ్యకు మారేజ్ డే గిఫ్ట్‌గా గోల్డెన్‌రింగ్ సెలెక్ట్‌చేసి కౌంటర్ వద్ద డబ్బులు చెల్లిస్తుండగా అతనికళ్ళు మళ్ళీ అక్కడ ఉన్న వాల్ క్లాక్‌పై పడ్డాయి.

అప్పుడు సమయం సరిగ్గా పన్నెండు నలభై అవుతోంది. తను ఇంటికి వెళ్ళడానికి ఇంకా నలభై నిమిషాలు మాత్రమే ఉన్నాయి.

గబగబా బైక్ స్టార్ట్‌చేసి గేరు మార్చి క్లచ్ వదిలాడు. బైక్ వేగంగా పోతోంది. టైమ్ చూసుకోవడానికి అతను తన ఎడమ చేయి వైపు చూసుకున్నాడు.

అప్పుడు గుర్తుకు వచ్చిందతనికి తను తన వాచ్‌ను హాస్పిటల్‌లోనే మరచివచ్చాడని. వెంటనే తల తిప్పి హెడ్ లాంప్ పైనున్న స్పీడో మీటర్‌పై చూశాడు. మీటర్ స్పీడ్‌ను సూచించడం ఆపేసింది.

బైక్‌ను రోడ్డుకు ప్రక్కగా ఆపి మీటర్ కేబుల్‌ను చెక్ చేసాడు. కేబుల్ తెగి పోయి ఉంది. తను అక్కడినుండి బైక్‌పై గంటకు అరవై కిలోమీటర్ల వేగంతో వెళితే అరగంటలో సౌమ్యను చేరుకుంటాడు.

సౌమ్య గుర్తుకురాగానే అతనిలో హుషారు పుట్టుకొచ్చింది. అతని మెదడు వేగంగా పనిచేయటం ప్రారంభించింది.

సంతోష్ బైక్‌కు కుడివైపువున్న బాక్స్‌లో 'ఫస్ట్ ఎయిడ్ బాక్స్, మెడికల్ కిట్‌తో పాటు ఉన్న స్టెతస్కోప్‌ను బయటికి తీసాడు.

దాన్ని చెవిలో పెట్టుకొని తన హార్ట్ బీటింగ్ చెక్ చేసుకున్నాడు.

గుండె నిమిషానికి డెబ్బైసార్లు కొట్టుకొంటోంది.

జేబులోంచి పెన్ను పేపర్ తీసి లెక్కేసాడు. నిమిషానికి డెబ్బై సార్లు... ముప్పై నిమిషాలకు... రెండువేల ఒక్కవందసార్లు అంటే తన గుండె రెండువేల ఒక్కవంద సార్లు కొట్టుకునే లోపల తాను ఇంటికి చేరుకోవాలి.

స్టెతస్కోప్‌ను చెవిలో పెట్టుకొని దాని రెండవకొనను జేబులో గుండెకు ఆనించి పెట్టుకున్నాడు. ఇప్పుడు తన గుండె చప్పుడు తనకు చాలా బాగా వినిపిస్తోంది.

బైక్ స్టార్ట్ చేసి గుండె చప్పుళ్ళను లెక్కించడం మొదలు పెట్టాడు.

బైక్ వేగంగా పోతోంది. అతను గుండె చప్పుళ్ళు లెక్కిస్తున్నాడు.

ఒకటి... డెబ్బై... ఒక్కవందా నలభై.......... ఐదు వందల అరవై... పదహారు వందల ఎనభై...

సంతోష్ బైక్ వేగం పెంచాడు. సరిగ్గా పంతొమ్మిది వందల డెబ్బై అయిదు వరకు రాగానే బైక్ అతని ఇంటిముందు ఆగింది.

సౌమ్య బయట వరండాలో నిల్చుని తనకోసం ఎదురుచూస్తుందనుకున్న సంతోష్‌కు బయట సౌమ్య కన్పించక పోవడంతో ఆశ్చర్యమేసింది.

బైక్‌కు స్టాండ్ వేసి గబగబా ఇంట్లోకి నడిచాడు. లోపల హాల్లో సోఫాలో టేబుల్ క్లాక్‌ను, ఎదురుగా పెట్టుకుని కూర్చున్న భార్య వెనకనుంచి వెళ్ళి ఆమెకళ్ళు మూసాడు.

సౌమ్య అతన్ని గుర్తుపట్టి "హాయ్... గుడ్ ఆఫ్టర్‌నూన్ సంతోష్" అంది సంతోషంగా.

"గుడ్ ఆఫ్టర్‌నూన్" అంటూ ఆమె ప్రక్కకు వెళ్ళి కూర్చున్నాడు.

ఆమె ఎదురుగా ఉన్న టీపాయ్‌పై చిన్న టేబుల్ క్లాక్ కనిపించింది అతనికి. అందులో సరిగ్గా ఒకటిన్నర అవుతోంది.

అప్పుడర్థమైంది అతనికి. ఆమె తనగురించి వరండాలో నిల్చుని ఎదురు చూడకుండా సోఫాలో ఎందుకు కూర్చుందో, ఆమె తన పంక్చువాలిటీని గ్రహించి తన గురించి కాకుండా టైము గురించి ఎదురు చూసిందని.

అతని ఆలోచనని గ్రహించిన సౌమ్య నవ్వుతూ అంది. "ఐనో వాట్ ఈస్ మై హస్‌బండ్" ఆమె మాటలు పూర్తి కాకుండానే సంతోష్ ఆమె పెదవులను తన పెదవులను గట్టిగా మూసేసాడు.


బి. సతీష్ కుమార్
ఇం.నం. 1-1-8, వినాయక్ నగర్,
నిజామాబాద్ - 503 003.





కెలదు చెన్నప్ప (కార్టూనిస్ట్), 8వ తరగతి, జ.పి.ని. పాఠశాల, పోస్ట్: మోహన్‌రావుపేట, వయా: మేడపల్లి